సిఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

ప్రజాశక్తి - జగ్గంపేట

సిఎం సహాయనిధి చెక్కులను టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ లబ్ధిదారులకు అందజేశారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో గోకవరం గ్రామానికి చెందిన కంటిపూడి సునీత రమాదేవికి రూ.36,278, గాదెపాలెం గ్రామానికి చెందిన పీత రాజేశ్వర్‌కి రూ.71,834 చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఒక వరం అని, పేద కుటుంబాలు వైద్యకోసం దరఖాస్తు చేసిన వెంటనే సిఎం నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అడపా భరత్, ఉప్పలపాటి బుల్లెబ్బు, ఎస్‌విఎస్.అప్పల రాజు, జీను మణిబాబు, భూపాలపట్నం ప్రసాద్, రాయి సాయి పాల్గొన్నారు.

ధాన్యం దళారుల పాలు

- మద్దతు ధర కూడా దక్కని వైనం
- వ్యాపారుల తీరుతో రైతులకు నష్టం
- కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ప్రభుత్వం జాప్యం

ప్రజాశక్తి - గండేపల్లి

ప్రయివేటు వ్యాపారులు, దళారుల చేతుల్లో అన్నదాతలు దగాకు గురౌతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటను తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ రైతుల శ్రమను దోచుకుంటున్నారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు ఆలస్యమవ్వడంతో రైతులు ప్రయివేటు వ్యాపారులు, దళారులను ఆశ్రయిస్తున్నారు. దళారులు ఇష్టారాజ్యాంగా ధరలను నిర్ణయించి రైతులను మోసం చేస్తూ ధాన్యాన్ని దోచుకుంటున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నిల్వ ఉంచితే మరింత నష్టపోవాల్సి వస్తుందన్న భయంతో వ్యాపారులు అడిగిన మేరకు తక్కువ ధరకే అన్నదాతలు ధాన్యాన్ని విక్రయిస్తున్నారు.

జగ్గంపేట నియోజకవర్గంలో సుమారు 30 వేల ఎకరాల్లో ఖరీఫ్‌లో వరి పంటను రైతులు సాగు చేశారు. ఒక్క గండేపల్లి మండలంలో 6,728 ఎకరాల్లో వరి సాగు జరిగింది. ఇక్కడ పండిన పంటను కొనుగోలు చేసేందుకు గత ఏడాది 12 కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రస్తుతం వరి కోతలు ప్రారంభం అయ్యాయి. రోడ్లపైనే రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు. ఇప్పటికే సుమారు 70 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. సకాలంలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ప్రయివేటు వ్యాపారులు, దళారులను ఆశ్రయించక తప్పటేదు. అల్పపీడన కారణంతో కురుస్తున్న వర్షాలతో కోసిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కోతలు పూర్తయిన ప్రాంతాల్లో రబీ సాగుకు సైతం గండేపల్లి మండలంలో రైతులు సిద్ధమౌతున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో దమ్ములు చేస్తున్నారు. మిగిలిన జగ్గంపేట, కిర్లంపూడి, గోకవరం మండలాల్లోనూ కోతలు కోయడం ప్రారంభం అయింది. ఇప్పటికే సుమారు 20 శాతం కోతలు పూర్తయినట్లు అంచనా.

వ్యాన్‌లోకి ధాన్యాన్ని ఎత్తుతున్న కూలీలు

ప్రస్తుతం ప్రయివేట్ వ్యాపారులు 75 కేజీల బస్తాను రూ.1400 కు కొనుగోలు చేస్తున్నారు. కొంతమంది తరుగు కింద మరో మూడు కేజీలు అదనంగా తీసుకుంటున్నారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అయితే రైతులకు గిట్టుబాటు ధర లభించేది. ఇప్పటి వరకు ఎక్కడా కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు ప్రయివేటు వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోంది. తుపాన్ ప్రభావంతో గత 4 రోజులుగా తరచూ చిరుజల్లులు పడుతుండటంతో రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. భారీ వర్షం కురిస్తే కళ్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోతుందని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ హెచ్చరికలతో రైతులు నూర్పిన ధాన్యాన్ని కళ్లాలు చేసిన వెంటనే తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. దీంతో బస్తాకు రూ.300పైగా రాబడిని కోల్పోతున్నారు. అధికారులు మార్కెటింగ్‌లో జరుగుతున్న దోపిడీని గుర్తించి నియోజకవర్గవ్యాప్తంగా తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కనీస మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించాలని రైతులు కోరుతున్నారు.

మద్దతు ధర ప్రకటించాలి

తొలకరి పంటలో పండించిన వరికి కూటమి ప్రభుత్వం తక్షణమే మద్దతు ధరను ప్రకటించాలి. గత ప్రభుత్వంలో బస్తా ధాన్యాన్ని రూ.1800కు విక్రయించాం. నేడు రూ.1400 ధరకే అమ్మకం చేయాల్సివస్తుంది. దీంతో రైతు తీవ్రంగా నష్టపోతున్నాడు. ప్రభుత్వం చొరవ తీసుకొని రైతులకు మద్దతు ధర ప్రకటించాలి.

-సుంకవల్లి దుర్గారావు, రైతు, మురారి

నష్టానికి విక్రయిస్తున్నాం..

సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులకు ధాన్యాన్ని విక్రయించి నష్టపోతున్నాం. పంట చేతికొచ్చిన వెంటనే విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలు లేవు. దళారులు చెప్పిన ధరకే విక్రయిస్తున్నాం. తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.

-ఈరల సూరిబాబు, రైతు, గండేపల్లి.

20 శాతమే కోతలు పూర్తి

నియోజకవర్గంలో ఇప్పటి వరకూ 20 శాతం వరకూ కోతలు పూర్తయ్యాయి. గండేపల్లి మండలంలో అధికంగా కోతలు జరుగుతుండటంతో జిల్లాలోని మొదటి కొనుగోలు కేంద్రం గండేపల్లిలోనే బుధవారం ప్రారంభించాం. జగ్గంపేటలో 15, గండేపల్లిలో 13, కిర్లంపూడిలో 14, గోకవరంలో 12 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాము. వీటిని వచ్చే నెల మొదటి వారంలో ప్రారంభిస్తాం.

-జి.శ్రీనివాస్, ఎడిఎ, జగ్గంపేట

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి

ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఐక్య పోరాటాల ద్వారానే కార్మిక హక్కులను సాధించుకోగలమని సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి అన్నారు. బుధవారం స్థానిక సిఐటియు అనుబంధ లారీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో సిఐటియు నాయకుడు రొంగల ఈశ్వరరావు అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలంటే ఐక్య పోరాటాలు అవసరమన్నారు. కార్మికులకు పనికి తగ్గ వేతనం ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం పని గంటలు పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేసిందన్నారు. గత 15 నెలలుగా వేతనాలు పెరగలేదు కానీ ధరలు విపరీతంగా పెరిగాయని అన్నారు. ప్రజలకు, పర్యావరణానికి హానికరమైన డేటా సెంటర్‌లను ఆహ్వానించడం దారుణమన్నారు. అక్టోబర్ 25, 26 వ తేదీలలో పెద్దాపురంలో జరిగే సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం సిఐటియు మండల కన్వీనింగ్ కమిటీ ఎన్నికలు జరిగాయి. కమిటీ కన్వీనర్‌గా కాకరపల్లి సునీత, కో కన్వీనర్లుగా కడగల ఆదినారాయణ, పి.సోమరాజు, పిల్ల రాంబాబు, జయరాం, విజయకుమార్, ఎఎన్.అమరావతి, ఎం.అంజి, కె.భవాని, సత్యవేణి, వరలక్ష్మి ఎన్నికయ్యారు.

రైతులకు మేలు చేసేలా చర్యలు

ప్రజాశక్తి - శంఖవరం

నూతన పాలకవర్గం రైతులకు మేలు చేసేలా నిర్ణయాలు తీసుకోవాలని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. బుధవారం అన్నవరంలో ఆత్మ కమిటీ పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల ఆత్మ కమిటీ పాలకవర్గ సభ్యులు ఒకే కుటుంబంగా భావించి, రైతుల అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. రైతు సమస్యలను తెలుసుకుని వారికి సాంకేతిక అవగాహన, శిక్షణ, ప్రదర్శన క్షేత్రాలు, చైతన్య యాత్రలు నిర్వహించడం వంటి కార్యక్రమాల చేపట్టాలని అన్నారు. ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ రైతులకు సాయం చేయాల్సిన బాధ్యత ఆత్మ కమిటీలపై ఉందన్నారు. వాతావరణంలో వచ్చే మార్పులు, పంటల ఎంపిక, మార్కెటింగ్ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం కమిటీ ఛైర్మన్‌గా నరహరిశెట్టి సూర్య ప్రకాష్, వైస్ ఛైర్మన్‌గా కరణం సుబ్రహ్మణ్యం, ఇతర సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి, నాయకులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

గట్టును ఢీకొని బోటు బోల్తా

ప్రజాశక్తి - యు. కొత్తపల్లి

అమీనాబాద్ రేవు వద్ద నిర్మిస్తున్న హార్బర్ గట్టును ఢీకొని బోటు బోల్తా పడింది. బోటులో ఉన్న మత్స్యకారులు సముద్రంలోకి దూకి సురక్షితంగా ఒడ్డికి చేరుకున్నారు. బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం..అమీనాబాద్ గ్రామానికి చెందిన బోటు యాజమని పల్లేటి గాబ్రియల్ బోటుపై ముగ్గురు మత్స్యకారులు మంగళవారం ఉదయం అమీనాబాద్ రేవు నుంచి వేటకు వెళ్లారు. సముద్రంలో మత్స్య సంపద లభించకపోవడంతో తిరిగి అర్ధరాత్రి వస్తుండగా రేవులో నిర్మిస్తున్న హార్బర్ రాళ్ల గట్టును తగులుకొని బోటు బోల్తా కొట్టింది. దీంతో బోట్లో ఉన్న ముగ్గురు మత్స్యకారులు సముద్రంలోకి దూకి ప్రాణాలు రక్షించుకున్నారు. ఈ ప్రమాదంలో బోటు ధ్వంసం, వలలు తెగిపోవడంతో మత్స్యకారులు లబోదిబో మంటున్నారు. సుమారు రూ.4 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్టు బోటు యజమాని తెలిపారు.

ధ్వంసమైన బోటు

ప్రయివేటీకరణ ప్రతిపాదన విరమించుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ

నగరపాలక సంస్థ పార్కుల ప్రయివేటీకరణ ప్రతిపాదనను తక్షణమే ఉపసంహరించుకోవాలని సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారిగా ఉన్న కలెక్టర్ ఆదాయాన్ని సమకూర్చుకునే పేరుతో నగరంలోని 9 పార్కులు ప్రయివేటు వారికి అప్పగించడానికి ఆహ్వానిస్తున్నట్లు చేసిన ప్రకటన రాజ్యాంగ విరుద్ధంగా ఉందన్నారు. పార్కులు ప్రయివేటు వారికి అప్పగిస్తే ఫీజులు వసూలు చేస్తారని, దీంతో ప్రజలు పార్కుల్లో సంచరించే అవకాశాన్ని కోల్పోతారని అన్నారు. గత టిడిపి పాలనలో వివేకానంద పార్క్ ప్రయివేటీకరణ చేయాలని చేసిన ప్రయత్నాలను నగర ప్రజలు సమిష్టిగా తిప్పికొట్టారని గుర్తు చేశారు. గత మూడేళ్లుగా నగరపాలక సంస్థకు ఎన్నికలు లేకపోవడంతో 15 ఆర్థిక సంఘం నిధులు విడుదల కాలేదన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల ఆస్తి పన్ను బకాయిలు పేరుకుపోతున్నాయన్నారు. నగర అభివృద్ధికి కావాల్సిన నిధులను ప్రజాప్రతినిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రాబట్టేలా కృషి చేయాలని హితవు పలికారు. ఆదాయం కోసం పార్కులను ప్రయివేటు సంస్థలకు అప్పగించే ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాసంఘాలను, రాజకీయ పక్షాలను కూడగట్టి ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు మలక వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న సిపిఎం నాయకుడు వీరబాబు

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - కాకినాడ, తుని

కాకినాడ తుని పట్టణంలో 8వ తరగతి విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిపై ఖఠినమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.శ్రీకాంత్, ఎం.గంగాసూరిబాబు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినికి తాతయ్య పేరు చెప్పి టిడిపి మాజీ కౌన్సిలర్ చేసిన దారుణం సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేసి నిందితునికి కఠినమైన శిక్ష విధించి బాధితురాలికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు భవిషత్తులో జరుగకుండా ప్రతి గురుకుల పాఠశాలకు, సంక్షేమ వసతి గృహలకు సెక్యూరిటీ గార్డ్‌లను ప్రభుత్వం నియమించాలని డిమాండ్ చేశారు.అలాగే తుని మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఇన్నిగంటి సత్యనారాయణ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జరిగిన ఘటన తీవ్రంగా ఖండిస్తున్నామని, ముక్కుపచ్చలారని చిన్నారిపై జరిగిన ఘటన సభ్య సమాజం తలదించుకునేలా ఉందని అన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, కూటమి ప్రభుత్వం ఎప్పుడూ నేరస్తులను ప్రోత్సహించదని అన్నారు.

సాయం కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి - జగ్గంపేట

అనారోగ్యంతో బాధపడుతున్న గరగ నాగఆంజనేయ దుర్గారావు సాయం కోసం ఎదురుచూస్తున్నాడు. రోజు కూలీకి వెళితేనే కుటుంబ పోషణ జరుగుతుంది. అటువంటి దుర్గారావుకు తల్లి, భార్య, కొడుకు ఉన్నారు. వారందరినీ అతనే పోషించాలి. దీనికితోడు అతని ఆరోగ్యం క్షీణించింది. ఏమి తినలేక పోతున్నాడు. ఏమి తిన్నా రక్తంతో కూడిన వాంతులు అవుతున్నాయి. అతను ఆసుపత్రికి వెళ్లడంతో కడుపులో పుండ్లు ఏర్పడ్డాయని, దానివలన ఏమీ తినలేక పోతున్నాడని వైద్యులు చెప్పారు. లివర్ సంబంధిత సమస్యతో శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు సూచించారు. అందుకు కొన్ని పరీక్షలు చేయించుకుని రావాలని వైద్యులు సలహా ఇచ్చారు. ఆ పరీక్షలు చేయించుకునే ఆర్థిక స్థోమత అతనికి లేకపోవడంతో దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నాడు. బాధితుఁకి సాయం చేసే వారు 9441146487 ఫోన్ చేసి సాయాన్ని అందించాలని కోరుతున్నాడు. అతని యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 066910100082940కు దాతలు సహకరించాలని కోరుతున్నాడు.

బాధితుడు దుర్గారావు

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - గండేపల్లి

పరిసరాల పరిశుభ్రతకు ప్రతీ ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఆర్‌డిఒ శ్రీరమణి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద స్వచ్ఛతాహి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కాంపౌండ్ వాల్‌ను ప్రారంభించి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ అడపా భరత్, పుష్కర ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ అడబాల భాస్కరరావు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు, గండేపల్లి సొసైటీ ఛైర్మన్ కంటిపూడి సత్యనారాయణ, వైస్ ఎంపిపి కుంచే రాజా, నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, జాస్తి వసంత్, కందుల చిట్టిబాబు, బాబ్జి, బొల్లం రెడ్డి రామకృష్ణ, వెలమాకి కాశి, డిప్యూటీ తహశీల్దార్ దివ్య పాల్గొన్నారు.

మొక్కను నాటుతున్న జ్యోతుల నవీన్

రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా తప్పదు

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని రోడ్లపై చెత్త వేస్తే కఠినంగా జరిమానాలు విధించనున్నట్లు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కెటి.సుధాకర్ హెచ్చరించారు. బుధవారం ఆయన నగరంలోని పలు డివిజన్లలో పర్యటించి శానిటేషన్ నిర్వహణను పరిశీలించారు. జగన్నాథపురంలోని చంద్రిక థియేటర్ వద్ద కల్వర్ట్‌పై స్లాబ్ లేక ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించిన అదనపు కమిషనర్ తక్షణమే అధికారులకు కల్వర్టుపై స్లాబ్లు వేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నుంచి వచ్చే చెత్తను రోడ్లపై పడేయకుండా తప్పనిసరిగా పారిశుధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. ఇకపై ఎవరు రోడ్డుపై చెత్త వేస్తే వారికి జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. నగర శుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటేషన్ సూపర్‌వైజర్లు రాంబాబు, నాయుడు, ఇంజనీరింగ్ విభాగ అధికారులు పాల్గొన్నారు.

శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ సుధాకర్

ప్రజా సమస్యలపై పోరాడాలి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పార్టీ పదవులను పొందిన నాయకులంతా ప్రజా సమస్యలపై పోరాడాలని మాజీ ఎంపి వంగా గీత సూచించారు. వైసిపి పట్టణ అధ్యక్షుడిగా మైనం రాజా, బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గంట అప్పలస్వామి నియమితులైన సందర్భంగా స్థానిక వైసిపి కార్యాలయంలో వారిని అమె అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీకి, ప్రజలకు వారధిగా పని చేసి ప్రజా సమస్యలపై పోరాడాలని, పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గండేటి శ్రీరామచంద్రమూర్తి, జ్యోతుల భీముడు, అనిశెట్టి సుబ్బారావు, తెడ్లపు చిన్న, అంజూరు రాంబాబు, ప్రసన్న పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలు గ్రామంలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారం ప్రారంభం అయ్యాయి. ఈ పోటీలను పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చొరవతో మండలంలోని అనేక పాఠశాలలకు క్రీడా కిట్లు అందజేసినట్లు తెలిపారు. రూ.3 కోట్లతో బౌండరీ వాల్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు ఎంఇఒలు వెన్న శ్రీనివాస్, బి.శివప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రకాష్, పీడీ టి.వెంకటరాజు, పాఠశాల స్థలదాత చల్లా చినబాబు, ఎస్ఎంసి ఛైర్మన్ చల్లా వీరాంజనేయులు, ఎపి పద్మశాలి వెల్ఫేర్ అండ్ కార్పొరేషన్ డైరెక్టర్ సూరిశెట్టి జయకృష్ణ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కబాడ్డీ ఆడుతున్న విద్యార్థులు

హెల్త్ సెంటర్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం కాయకల్ప అసెస్మెంట్ స్టేట్ బృందం తనిఖీలు నిర్వహించింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆర్.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో ఆసుపత్రి పరిసరాలు, పరిశుభ్రత అంశాలతో పాటు అన్ని విభాగాల రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాయకల్ప అసెస్మెంట్ నోడల్ ఆఫీసర్ వి.శ్రీవిద్య, హెడ్ నర్స్ రమాదేవి, ఫార్మాసిస్టు కమల కుమారి పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం

పాముల వేటగాడి ఇంట్లో భారీ జెర్రిపోతు

ప్రజాశక్తి - తాళ్లరేవు

పాము కనిపిస్తే అందరూ ఆ గ్రామంలో ఆయనను సంప్రదించాల్సిందే...పాముల వేటగాడుగా ఆయనకు అంత పేరుంది. మరి ఆయన ఇంటికే పాము వస్తే ఊరుకుంటాడా... కొట్టినారతీయడు... అలాంటి సంఘటన మండలంలోని పి. మల్లవరంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన విల్ల సత్యనారాయణ ఒక సాధారణ రైతు, పాములను కొట్టడంలో దిట్ట.. ఆయన ఇంటిలోకి భారీ జెర్రిపోతు పాము చొరబడింది. వంటగదిలో పామును చూసి ఆయన భార్య ప్రాణ భయంతో బయటకు పరుగులు తీసింది. సత్యనారాయణ వెంటనే కర్ర తీసుకుని ఆ పామును కొట్టి దానిని ఆ కర్రకు వేలాడదీసి గ్రామంలో చక్కర్లు కొట్టాడు. ఇది చూసి జనం ఆశక్తిగా తిలకించారు. తనకిప్పుడు 75 సంవత్సరాలని, 15 వ ఏట నుంచే పాములను కొట్టడం ప్రారంభించానని కొట్టే కర్ర కూడా అప్పటిదేనని సత్యనారాయణ తెలిపారు. గ్రామంలో ఎక్కడ పాము కనిపించినా తనకే ఫోన్ వస్తుందని ఆయన తెలిపారు.

చంపిన పామును చూపుతున్న సత్యనారాయణ

స్కేటింగ్‌లో కిట్స్ విద్యార్థినికి బంగారు పతకం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని దివిలి ఇంజనీరింగ్ కళాశాల బి ఫార్మసీ విద్యార్థి జెజి.సుప్రజ డిస్ట్రిక్ట్ స్కేటింగ్ కాంపిటీషన్లో బంగారు పతకం సాధించింది. ఇటీవల కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్ 18 ఎబౌ విభాగంలో ఆమె ఈ బంగారు పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో ఆమెను కళాశాల ఛైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ డాక్టర్ వై.రత్నసింధు, కళాశాల డైరెక్టర్ సుజన్, పిడి స్వామి అభినందించారు.

విద్యార్థినిని అభినందిస్తున్న కళాశాల ఛైర్మన్

పోలీసు విధులపై అవగాహన

ప్రజాశక్తి - జగ్గంపేట

పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ రఘునాథరావు పోలీసుల విధులపై శ్రీ ప్రజ్ఞ విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఫిస్టల్‌లో ఎన్ని బుల్లెట్లు ఉంటాయి, ఎలా ఉపయోగిస్తారు అనే విషయాలను వివరించారు. వైర్‌లెస్ సెట్ ద్వారా సమాచారాన్ని ఏ విధంగా సమాచారం అందిస్తారో అవగాహన కల్పించారు.

నేరాలు ఘోరాలు

పేకాడుతున్న పదిమంది అరెస్ట్

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రానికి చెందిన శివారు ప్రాంతంలో పేకాట శిబిరంపై పోలీస్ సిబ్బందితో దాడి చేసి పేకాడుతున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ జి.నరేష్ బుధవారం తెలిపారు. వివరాల ఇవి.. మండలంలో వివిధ ప్రదేశాలలో పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సమాచారంతో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా మండల కేంద్రం శివారు ప్రాంతంలో ఏర్పాటు చేసిన శిబిరంపై ముందస్తు సమాచారం మేరకు ఆకస్మిక దాడి చేసి పేకాడుతున్న పదిమందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.3050 స్వాధీనం చేసుకుని నగదు సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే వారిపై ఎపి గేమింగ్ యాక్ట్‌పై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి - కడియం

మండలంలో కడియపులంక (బుర్రిలంక) గోకుల్ నర్సరీ సమీపంలో 216ఎ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. హైవే పెట్రోలింగ్ అధికారులు తెలిపిన వివరాల మేరకు గాజువాక మండలం అగనంపూడికి చెందిన దాసరి కిరణ్‌కుమార్(26) విజయవాడ నుంచి విశాఖకు కారులో వెళ్తున్నాడు. బుధవారం ఉదయం కడియపులంకకు చేరుకున్నాడు. ఈ సమయంలో ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కిరణ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. హైవే సేఫ్టీ అధికారులు క్రేన్ సహాయంతో లారీ నుంచి కారును వేరు చేసి మృతదేహాన్ని బయటకు తీశారు. దీనిపై కడియం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని చిత్రాడ ప్లే ఓవర్ బ్రిడ్జి సమీపంలోని గుర్తుతెలియని వ్యక్తి హత్య కేసును పిఠాపురం పోలీసులు చేదించారు. బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో సిఐ జి.శ్రీనివాస్ మీడియాకు వివరాలను వెల్లడించారు. ఈ నెల 8వ తేదీన చిత్రాడ ప్లైఓవర్ బ్రిడ్జి సమీపంలోని వాసంసిట్టి పెద్దిరాజు వ్యవసాయ భూమిలో గుర్తు తెలియని ఒక వ్యక్తి తల, శరీరంపై గాయాలతో మృతదేహం ఉన్నట్లు విఆర్ఒ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో సాంకేతిక ఆధారాలు, సిసి పుటేజీలు, సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా మృతుడు తమిళనాడులోని థేని జిల్లా, మనుతు గ్రామానికి చెందిన పాండేగా గుర్తించామన్నారు. మృతుడు హనుమాన్ జంక్షన్ ప్రాంతంలో తినుబండారులు తయారు చేసే ప్యాక్టరీలో పని చేసేవాడని, అతనికి పనిలో పరిచయస్థులు అయిన తమిళనాడుకి చెందిన మడసామి, పాల్ రాజ్ ఆండోనీ, లౌర్దు పకీయం ఈ నెల 6న పూచి ధనలక్ష్మీ భర్త రామస్వామికి ఆరోగ్యం బాగా లేనందున అతననిని చూడటానికి పట్టణంలోని జగ్గయ్య చెరువు కాలానీకి వచ్చారు. ఈ సందర్భంగా ధనలక్ష్మీతో పాండే అసభ్యంగా ప్రవర్తించడంతో 7వ తేదీ ప్లేఓవర్ బ్రిడ్జి సమీపంలోని పంట పొలాలలో మడసామి, పాల్ రాజ్ ఆండోనీ, లౌర్దు పకీయం, ధనలక్ష్మి, ఆటో డ్రైవర్ దాగంటి గణేష్ కలిసి పాండేను రాయితో తలపై కొట్టి హత్య చేశారు. నిందితులను ఉప్పాడ కొత్తపల్లి గ్రామ శివారులో అరెస్టు చేసి, ఆటోను, నిందితుల ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు ఈ సమావేశంలో ఎస్ఐలు మణికుమార్, జాన్ భాషా, రామకృష్ణ, వెంకటేష్, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

వెండి వస్తువుల అప్పగింత

ప్రజాశక్తి - సామర్లకోట

పోగొట్టుకున్న వెండి వస్తువులను సామర్లకోట పోలీసులు తిరిగి సేకరించి పోగొట్టుకున్న వారికి బుధవారం అప్పగించారు. ఈ సందర్భంగా సిఐ ఎ.కృష్ణభగవాన్ మాట్లాడుతూ ఏలేశ్వరం మండలం కంబాలపాలెం గ్రామంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి చెందిన సుమారు ఒకటిన్నర కిలోల వెండి వస్తువులు మార్చుకునేందుకు ఆలయ కమిటీ సభ్యులు కొప్పిశెట్టి సత్తిబాబు, సొంటెపు బాలకృష్ణ కాకినాడ తీసుకెళ్లు మార్గమధ్యలో సంచి తెగిపోయి వెండి సామాన్లను పోగొట్టుకున్నారు. వారు సామర్లకోట పోలీసులను ఆశ్రయించగా హెడ్ కానిస్టేబుల్ రాజు, కానిస్టేబుల్ నాగరాజు వాటిని మెయిన్ రోడ్‌లో కనుగొన్నట్టు చెప్పారు. సంచిపై నుంచి వాహనాలు ఎక్కడంతో ఆలయ సామాగ్రి కొంతవరకు పాడవగా వాటిని శుభ్రపరచి ఆలయ కమిటీ సభ్యులకు తిరిగి అప్పగించినట్టు చెప్పారు. పోగొట్టుకున్న స్వామివారు, అమ్మవారల వస్తువులు వెతికి అప్పగించిన పోలీసులకు ఆలయ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని బుధవారం బైపాస్ రోడ్డుపై మోటారుసైకిల్ వ్యాను ఎదురె దురుగా ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగర పంచాయతి పరిధిలోని బైపాస్ రోడ్డు పెట్టా వారి పేట సమీపంలోని బుధవారం యానాం సుభద్రనగర్‌కు చెందిన మట్టపర్తి నూకరాజు, భార్య నూకరత్నం, కుమారుడు మట్టపర్తి రామ వెంకటకృష్ణ ప్రసాద్ అప్పనపల్లి గుడికి వెళ్ళి మోటారు సైకిల్‌పై తిరిగి వస్తున్నారు. ఈ సమయంలో నగర పంచాయతీ బైపాస్ రోడ్డులోని యానాం నుంచి అమలాపురం వైపు వెళుతున్న కోళ్ళ ఫారం వ్యాను వేగంగా వెళ్తూ మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కృష్ణప్రసాద్(22) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలు పాలైన నూకరాజు, నూకరత్నంలను అమలాపురం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. మృత దేహాన్ని శవ పంచనామా నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎస్ఐ జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంగాలమ్మ ఆలయంలో చోరీ

ప్రజాశక్తి - గోకవరం

గోకవరం గ్రామ శివారున ఉన్న గంగాలమ్మ ఆలయంలో 750 గ్రాముల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయం పక్కనే ఉన్న టీషాపులో రూ.10వేల నగదు చోరీకి గురైంది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు వారు తెలిపారు. ఘటనా స్థలాన్ని గోకవరం పోలీసులు పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - గండేపల్లి

స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఛైర్మన్ తోట సుధీర్, నియోజకవర్గం అభివృద్ధి కమిటీ ఛైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా సివిల్ సప్లయి మేనేజర్ డికె.నాయక్ మాట్లాడుతూ సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.2389, గ్రేడ్ ఏ క్వింటా ధాన్యానికి రూ.2369 చొప్పున చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రైతుల తన ధాన్యాన్ని శుభ్రం చేసుకుని తేమ శాతం 17 శాతం కంటే తక్కువ ఉండేలా సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు

కొనుగోలు కేంద్రంలో పూజలు చేస్తున్న నవీన్

చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని పిలుపునిచ్చారు. రైతులు సులువైన పద్ధతిలో ధాన్యాన్ని అమ్ముకునేలా ప్రణాళికను తయారు చేయాలని అధికారులకు టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సూచించారు. రైతులకి అవసరమైతే డ్రైవర్లను మార్కెట్ కమిటీల్లో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లయి రాష్ట్ర ఛైర్మన్ సుధీర్ అన్నారు. ఈ సందర్భంగా జెడ్.రాగంపేటకు చెందిన రైతు వెంకట్రావుకు మంజూరు అయిన డ్రోన్‌ను వారు అందజేశారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట ఎఎంసి ఛైర్మన్ అడప భరత్, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు, ఆర్‌డిఒ శ్రీరమణి, తహశీల్దార్ శ్రీనివాస్, స్థానిక నాయకులు కందుల చిట్టిబాబు, జాస్తి వసంత, వ్యవసాయ అధికారి లక్ష్మి, రైస్ మిల్ అసోసియేషన్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

చదువు పూర్తి చేసిన ప్రతి ఒక్కరు ఉద్యోగమే పరమావధి అనుకోకుండా స్వయం ఉపాధిపై అవగాహన కలిగి ఉండాలని ఎంపిడిఒ సిహెచ్.రవికుమార్‌వర్మ అన్నారు. బుధవారం స్థానిక గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో 20 రోజులు పాటు నిర్వహించే చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత కేవలం ఉద్యోగాల పైనే ఆధారపడకుండా ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ట్రేడ్స్ ఐటి, ఐఐసి ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తుందని తెలిపారు. వ్యాపార మెలుకువలు, ప్రభుత్వ సబ్సిడీ, యంత్రాల కొనుగోలు రుణాలపై వివరించారు. శిక్షణకు 30 మంది విద్యార్థులను

సదస్సులో మాట్లాడుతున్న ఎంపిడిఒ

ఒక్క గ్రూపుగా విభజించి 20 రోజులు పాటు ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీత, డిప్యూటీ ఎంపిడిఒ ఎంవిఆర్ఆర్.వర్మ, పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ సిహెచ్.గణపతి, ఐఐసి ప్రెసిడెంట్ డాక్టర్ ప్రగడ ప్రయాగమూర్తి, వైస్ ప్రిన్సిపల్ కె.వెంకటేశ్వరరావు, ఎంఎస్ఎంఇ జిల్లా కోఆర్డినేటర్ వైస్ శ్రీనుబాబు పాల్గొన్నారు.

భోజనాలు వడ్డిస్తున్న ఎంఎల్ఎ, ఎంఎల్‌సి

దాతల సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి - తాళ్లరేవు

అన్నదానం చేయడానికి దాతలు అందిస్తున్న సేవలు ఎనలేనివనీ ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. మొదటిరోజు అన్నదానికి ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, పార్వతీ దంపతులు నగదును సమకూర్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయాలకు వచ్చే యాత్రికుల కోసం దాతలు అందిస్తున్న సేవలు అభినందనీయులని అన్నారు. ఆలయాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక గురుస్వామి దొమ్మేటి సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షులు దూళిపూడి వెంకటరమణ, కట్ట త్రిమూర్తులు, నడింపల్లి వినోద్, వాసంశెట్టి శ్రీనివాస్, పొన్నమండ రామలక్ష్మి, టేకుమూడి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి - కాకినాడ

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక డిజిటల్ తరగతులు నిర్వహించారు. బుధవారం పిఆర్ గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిఐ ఎన్.రమేష్ ట్రాఫిక్ రూల్స్, హెల్మెట్ వాడకం, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనీ, కుటుంబ సభ్యులకు ఈ విషయాన్ని తెలియజేయాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ వలన జరిగే ప్రమాదాలపై హెచ్చరించారు. జీబ్రా లైన్ లేని ప్రదేశాల్లో రోడ్డు

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిఐ రమేష్

దాటేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఉపయోగాలను వివరించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణించరాదనీ, డ్రైవర్ పక్కన లేదా వెనుక భాగంలో కూర్చోరాదని విద్యార్థినులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్-1 ఎస్ఐ పి.కిషోర్‌కుమార్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధునికి దుస్తులు, పండ్లు పంపిణీ చేస్తున్న దేవస్థానం ఛైర్మన్ రోహిత్

దేవస్థానం మాజీ ఛైర్మన్ రామ్‌కుమార్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్ ఐవి రామ్‌కుమార్ బహదూర్‌కు ఘనంగా నివాళులర్పించారు. బుధవారం దేవస్థానం ఛైర్మన్ ఐవి.రోహిత్ బంగ్లాలో రామ్‌కుమార్ 10వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ రోహిత్ చేతుల మీదుగా పేదలకు దుస్తులు, పండ్లు, బిస్కెట్లు అందజేశారు. స్థానిక శాంతి వర్ధిని మానసిక వికలాంగుల పాఠశాల విద్యార్థులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఇఒ వీర్ల సుబ్బారావు, ప్రజా ప్రతినిధులు ఎస్.కుమార్‌రాజా, బొబ్బిలి వెంకన్నబాబు, దారా వెంకటరమణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఇకెవైసి పూర్తి చేయాలి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఉపాధి హామీ చట్టం కూలీలకు ఇకెవైసి పూర్తి చేయాలని ఉపాధి హామీ జిల్లా సహాయ పథక సంచాలకులు వసంత మాధవి ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇకెవైసి నమోదుపై ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ ఉపాధి వేతనదారులందరికీ ఇకెవైసి ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ సెలెట్ రాజు, ఎపిఒ రాయుడు గంగాభవాని, సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్‌లో బుధవారం పట్టణంలోని టంగుటూరి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ ఇన్‌ఛార్జ్ బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సైన్స్ ప్రయోగాలను విద్యార్థులతో చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యానాంలో భారీ వర్షం

ప్రజాశక్తి - యానాం

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండంతో బుధవారం యానాంలో ఏకధాటిగా కురిసిన భారీ వర్షాలకు పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. దీంతో స్థానికులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. నిత్యం రద్దీగా ఉండే పిల్లారాయవీధి మునిగిపోవడంతో ఆ ప్రాంత ప్రజలు నాని ఇక్కట్లకు గురయ్యారు. పిల్లారాయ ఆలయంలోకి వర్షపునీరు ప్రవేశించింది. ప్రభుత్వ డిగ్రీకళాశాలలో సైతం మోకాలు లోతు వర్షపునీరు నిలిచిపోవడంతో విద్యార్థులు బయటకు రావడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

డ్రైయినేజీ వ్యవస్థ పరిశీలన

ప్రజాశక్తి - యానాం

డ్రెయినేజీల్లో వ్యర్థాలతో నిండి పోయి వర్షపు నీరు వెళ్లకపోవడంతో రోడ్లపై వర్షపునీరు నిలిచిపోతుండంతో ఆర్ఎఒ అంకిత్‌కుమార్ ఆ ప్రాంతాలను బుధవారం పరిశీలించారు. స్థానిక పిల్లారాయవీధిలో పిడబ్ల్యూడి అధికారులతో కలిసి చర్చించారు. డ్రెయినేజీలో వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు.

బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్ర పరిధిలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శైలజ బ్లడ్ బ్యాంక్‌కు కావలసిన మౌలిక వసతులు, సిబ్బంది తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, రాష్ట్ర అధికారుల దృష్టికి ఏలేశ్వరంలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు ఆవశ్యకతను తీసుకువచ్చారన్నారు. ఏలేశ్వరం ఆసుపత్రిలో సాధ్యమైనంత త్వరలోనే బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ

సిబ్బందితో మాట్లాడుతున్న జెడి శైలజ

కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో ఛైర్మన్లు జొన్నాడ వీరబాబు, వాగు రాజేష్, వార్డ్ కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, ఎండగుండి నాగబాబు, విఆర్ఒ అవసరాల కిషోర్, స్థానిక వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల గుర్తింపు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

గ్రామసభల్లోనే ఉపాధి హామీ పనులను గుర్తించడం జరుగుతుందని ఎంపిడిఒ లక్ష్మీరెడ్డి అన్నారు. బుధవారం ఎండపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని ఈ-శ్రమ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026-27 సంవత్సరానికి గ్రామ సభలో తెలిపిన పనులకే కాకుండా కొత్త పనులు గుర్తించడానికి రెండు రోజులు సమయం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని పరిశీలించి పలు రికార్డులను

గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపిడిఒ లక్ష్మీరెడ్డి

తనిఖీ చేశారు గ్రామస్తులకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ కొండబాబు, సర్పంచ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్యలో అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య విశ్వవిద్యాలయం సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'ఎటాబ్స్ ఉపయోగించి నిర్మాణం విశ్లేషణ' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెనెసిస్ ప్లానర్స్ ప్రైవేట్ లిమిటెడ్ స్ట్రక్చరల్ ఇంజనీర్ మోహన్ బలగ పాల్గొని అవగాహన కల్పించారు. కోర్సు సమయంలో, విద్యార్థులు ఎటాబ్స్ సాఫ్ట్‌వేర్‌పై ఆచరణాత్మక శిక్షణ ఇచ్చారు. స్ట్రక్చరల్ మోడలింగ్, విశ్లేషణ మరియు డిజైన్‌కు ఆచరణాత్మకంగా వివరించారు. స్ట్రక్చరల్ ఇంజనీరింగ్‌లో విద్యార్థుల సాంకేతిక సామర్థ్యాన్ని

అతిథికి మెమోంటో అందిస్తున్న ఆదిత్య ప్రతినిధులు

పెంచిందని డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ విభాగం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎర్ర మట్టి తవ్వకాలపై చర్యలకు వినతి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

లాటరైట్ (ఎర్రమట్టి) తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని పలువురు గిరిజనులు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. బుధవారం అనకాపల్లి జిల్లాకు నాతవరం మండలం బబిడికలొద్ది, తొరడ గ్రామాల్లో చేపడుతున్న ఎర్రమట్టి తవ్వకాలను నిలిపివేయాలని కోరుతూ చేబ్రోలు గ్రామంలో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ క్యాంప్ కార్యాలయంలో పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని అందించారు. బబిడికలొద్ది, తొరడ గ్రామాల వెల్ఫేర్ సొసైటీ గిరిజనులు ఎం.నూకరాజు, శాంతి మాట్లాడుతూ ప్రకృతిపై ఆధారపడుతూ కొండపోడు వ్యవసాయం చేసి జీవనం సాగించే వాళ్ళమని, కానీ లాటిరైట్ తవ్వకాలతో కొండపోడు వ్యవసాయం లేక తమ జీవనం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్ర మట్టి తవ్వకాలతో లారీలు తిరగడంతో ప్రమాదాలు బారిన పడి ప్రాణాలు కోల్పోతూ భయాందోళనలో బతుకుతున్నామన్నారు. దీనిపై ఇదివరకే లాటిరైట్ మైనింగ్ రద్దు కోసం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించామని తెలిపారు. లాటిరైట్ తవ్వకాలు తరలింపులపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు ఎం.నూకాలమ్మ, టి.చెల్లయ్యమ్మ, సంకులమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఒరిజినల్ దస్తావేజు పోయినది

ఇంటి నాగలక్ష్మి, W/o. సత్యనారాయణ మూర్తి, డోర్ నెం. 6-21, వెలగతోడు, తూర్పుగోదావరి జిల్లాలో నివసిస్తున్న నా యొక్క ఒరిజినల్ దస్తావేజు నెం. **10089/1984, Dt. 03-12-1984,** రాజమండ్రి సబ్ రిజిష్టర్ వారి ఆఫీస్‌లో రిజిష్టర్ కాబడిన దస్తావేజు **ది. 18-10-2025వ తేదీన** నేను ప్రకాష్‌నగర్ రౌండ్ పార్కు వద్ద కలర్ జిరాక్స్ నిమిత్తం వెళ్ళుచుండగా ప్రకాష్‌నగర్ రౌండ్ పార్కు వద్ద పడిపోయినది. ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది ఫోన్ నెంబరుకు తెలియపర్చ వలసిందిగా కోరుచున్నాను.

ఇంటి నాగలక్ష్మి
సెల్: 9553298333

సిపిఆర్‌పై విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - కాకినాడ

రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ వైద్యుల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక విద్యాంజలి స్కూల్ విద్యార్థులకు సిపిఆర్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ వై.కల్యాణచక్రవర్తి, అసిస్టెంట్ గవర్నర్ అప్పసాని కృష్ణకుమారి పాల్గొని శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్కూల్ సిపిఆర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ట్రస్ట్ రామకృష్ణ అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తులను కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ గోపీనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇండియన్ సొసైటీ ఆఫ్ క్రిటికల్ కేర్ మెడిసిన్ జాతీయ అధ్య

సిపిఆర్ పై శిక్షణ పొందుతున్న విద్యార్థి

క్షులు డాక్టర్ సామవేద శ్రీనివాస్, ఇండియన్ రేసిపిటేషన్ కౌన్సిల్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎస్‌సి.చక్రరావు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కాకినాడ బ్రాంచ్ సభ్యులు, క్లబ్ కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ సానా, కోశాధికారి ఉదయ చక్రవర్తి, శ్రీనివాస్, చిరంజీవిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాసిరెడ్డి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - రౌతులపూడి

మాజీ సర్పంచ్ వాసిరెడ్డి వెంకటేశ్వర్లు కుటుంబాన్ని వైసిపి జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, మాజీ ఎంఎల్ఎ పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్, ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు, నాయకులు యనమల కృష్ణుడు, మదునూరి మురళీకృష్ణం రాజు, ఒమ్మి రఘురామ్ బుధవారం పరామర్శించారు. మృతికి కాల కారణాలను ఆయన కుమారుడు వైసిపి రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి జమీల్‌ను అడిగి తెలుసుకున్నారు. వాసిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిసి సెల్ అధ్యక్షులు సర్ణం శ్రీనివాస్, వైసిపి నాయకులు గొల్లు వెంకటరమణ, కుమార్ రాజా, యువజన విభాగం జిల్లా కార్యదర్శి తాతాజీ, తదితరులు పాల్గొన్నారు.

వాసిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

ఎడతెరిపి లేని వాన

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలో బుధవారం మధ్యాహ్నం నుంచి ఎడతెరిపిలేని వర్షం కురిసింది. దీంతో ప్రజల రాకపోకలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పంట పొలాల్లోకి వర్షపు నీరు భారీగా చేరింది. వ్యాపారాలు లేక బుధవారం మధ్యాహ్నం నుంచి దుకాణాలు సైతం మూసివేశారు.

In the Court of the III Additional Senior Civil Judge at Kakinada
H.M.O.P. No. 102/2025

Between:
Smt. Anasuri (Kopparthi) Manikyamba ***...Petitioner***
AND
Anasuri Mani Kumar ***...Respondent***

To:
Anasuri Mani Kumar, S/o. Ganga Raju, Hindu, aged 26 years, Business, R/o. Nakkala Y.Savaram, Peddapurapadu Village, Karapa Mandal, Kakinada District.

పై నెంబరు కేసులో పిటీషనరు తన భర్త అయిన మీపై విడాకులు కోరుతూ పిటిషను దాఖలు చేసియున్నారు. సదరు కేసులో శ్రీ కోర్టు వారి ద్వారా మీకు సమన్లు పంపించిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 12-11-2025 తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేని ఎడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
పితాని శ్రీనివాసరావు, అడ్వకేట్
కాకినాడ, సెల్: 9440614459

NOTICE UNDER SECTION 13(1) (a) & (b) of HINDU MARRIAGE ACT IN THE HONOURABLE COURT OF SENIOR CIVIL JUDGE AT NARASIPATNAM
H.M.O.P. No 14/2025

Between:
Peddireddi Karuna ...Petitioner
And:
Peddireddi Ramu ...Respondent
To
Peddireddi Ramu S/o Veerraju, aged 35 years, Hindu, Mason, Residing at Yeditha village, Mandapeta Mandal, Konaseema Ambedkar District.

NOTICE TO RESPONDENT

Please take notice that the above H.M.O.P petition filed the petitioner seeking for decree of divorce by dissolving the marriage between petitioner and you 01.05.2014 at Aryapuram, Rajahmundry (T), East Godavari District and for such other relief or reliefs and the notices of this court was not served so you are hereby directed to appear before the court may approach this court in person or through an Advocate and file necessary Proof of your claim on **14.11.2025 at 10.30 A.M,** failing which the matter will be decided as exparte.

(By Order of the Court)
R.B.NAIDU
Advocate, Narsipatnam
Narsipatnam.
Date: 21.10.2025.

IN THE COURT OF THE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT KAKINADA
I.A.No.436/2022, FDP.No.7/2021, OS.No.66/1999

Between:-
Jyothula Achayamma @ Buli Ammayi (Died)and Other's **...Petitioners/Plaintiffs**
And
Togaru Tulasamma and Other's **...Respondents/Defendents**

To.
Respondent-6
Togaru Devi, D/o. Late Togaru Somayya @ Krishna, Vemulavada, Karapa Mandal (Legal Representative of 2nd Respondent)

పై నెంబరు ఫైనల్ డిక్రి పిటిషన్ లో మీరు 6వ రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టు వారిద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.05-11-2025** వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం **గం॥10.30ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగాగాని మీ వకీలు ద్వారా గాని హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల ఫైనల్ డిక్రి పిటిషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వింజమూరి వెంకట్రావు
అడ్వకేట్, కాకినాడ
సెల్.9866550610

మహారాజశ్రీ కాకినాడ 3వ అదనపు జిల్లా మరియు సెషన్సు జడ్జి వారి కోర్టు, కాకినాడ
O.P. No. 233/2022
I.A. No. 1119/2025
I.A. No. 1120/2025

Between:
నేలపాటి వర్షిత **-పిటీషనర్**
మరియు
నేలపాటి రవికుమార్ **-రెస్పాండెంట్**

To:
నేలపాటి రవికుమార్, S/o. late జయరాజ్, డోర్ నెం. 24-8-130/11, కచేరిపేట, అంబేద్కర్ కాలనీ, కాకినాడ-1, కాకినాడ అర్బన్, కాకినాడ జిల్లా.

పై నెంబరు కేసులో పిటీషనరు తన భార్య అయిన మీపై విడాకులు కోరుతూ పిటీషను దాఖలా చేసియున్నారు. సదరు కేసులో శ్రీ కోర్టు వారి ద్వారా మీకు సమన్లు పంపించిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 29-10-2025వ తేదీన వాయిదా వేసియున్నారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
కడియాల వి.వి.యస్.యన్.మూర్తి
ఎ.భవాని, బి.రాంబాబు
కె.హిమబిందు, అడ్వకేట్లు
కాకినాడ, సెల్: 9949394515

In the Court of the V Additional Junior Civil Judge, Kakinada
O.S. No. 222/2025

Between:
Chukka Lovaraju ***...Plaintiff***
AND
Vemagiri Nookaratnam & Others ***...Defendants***

To: ***Defendants:***
1) Vemagiri Nookaratnam, W/o. (late) Baburao, House wife, SC Peta, 4th Street, Last Building, Kothuru Colony, V.K.Rayapuram, Samalkota Mandal.
2) Vemagiri Srilakshmi, D/o. (late) Baburao, SC Peta, 4th Street, Last Building, Kothuru Colony, V.K. Rayapuram, Samalkota Mandal.

పై నెంబరు దావాలో 1వ మరియు 2వ ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టు వారు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 06-11-2025వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
యనమల రామం
అడ్వకేట్, సర్పవరం జంక్షన్
కాకినాడ, సెల్: 9849083925

In the Court of the III Additional District Judge at Kakinada
F.D.P. No. 4/2025 in O.S. No. 81/2013

Between:
Kanduri Durga Suryakala & Others ***...Petitioners/ Plaintiffs***
AND
Kanduri Venkata Satya Siva Subrahmanya Surya Sriram and Others ***...Respondents/ Defendants***

To:
R-1: Kanduri Venkata Satya Siva Subrahmanya Surya Sriram, S/o. Sarveswara Rao, R/o. Plot No.104, Vanasthalipuram, Hyderabad.
R-2: Kanduri Ramalakshman, S/o. Sarveswara Rao, R/o. Plot No. 107, Siva Sai Flora, Dilsuuk Nagar, Hyderabad.
R-3: Jalumuri Venkata Subba Rao Suraj, S/o. Soma Raju, R/o. D.No. 35-2-42, Penkey vari Street, Kakinada.

పై నెంబరు ఫైనల్ డిక్రీ పిటీషన్‌లో 1 టు 3 రెస్పాండెంట్స్ అయిన మీకు శ్రీ కోర్టు వారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 28-10-2025వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై శ్రీ కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని యెడల పై ఫైనల్ డిక్రీ పిటీషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వింజమూరి వెంకట్రావు, అడ్వకేట్,
కాకినాడ, సెల్: 9866550610